## క్లుప్తంగా

### తెలుగుదేశం నాయకులపై అట్రాసిటీ కేసు

యద్దనపూడి: దొంగ ఓట్లు తొలగించేందుకు ఫారం–7 సమర్పించిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కులం పేరుతో దూషించటంతో పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్సై నాగశ్రీను వివరాల మేరకు.. మండలంలోని అనంతవరం గ్రామంలో ఈ నెల 14వ తేదీన మన్నం రాంబాబు గ్రామంలో దొంగ ఓట్లు ఉన్నాయని ఫారం–7ను అధికారులకు అందజేశాడు. ఈ నేపథ్యంలో ఎం.నరేంద్ర, జి.టి రామారావు, మరో నలుగురు వ్యక్తులు రాంబాబును కులంపేరుతో దూషించటంతో అతను స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకొని డీఎస్పీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పర్చూరు(చినగంజాం): రోటరీ క్లబ్ ఉచిత వైద్య శిబిరాలతో పాటు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని అదనపు ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా సాల్మన్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో పర్చూరు అపోలో డయాగ్నోస్టిక్ వారిచే ఉచిత రక్త పరీక్షల శిబిరం రోటరీ భవనంలో ఆదివారం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ కట్టా యోగానంద్, డాక్టర్ పేరిన మౌనిక, డాక్టర్ మనిషాలు వైద్యపరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీవివిధ రకాల పరీక్షలు జరిపి వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రోటరీ సభ్యులు కేఎస్ఆర్‌కే ప్రసాద్, పాటోలు ఉదయభాస్కర్, కొల్లా నరేంద్రకుమార్, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రంథాలయాలతో మెరుగైన విజ్ఞానం

- ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి

కారంచేడు: గ్రామాల్లోని అన్ని గ్రంథాలయాల ద్వారా చిన్నారులకు, విద్యార్థులకు 'చదువు అంటే మాకు ఇష్టం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే ఆదిలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె మండల కేంద్రం కారంచేడు చెరువు కట్ట మీద ఉన్న లైబ్రరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయంలోని అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలో ఎన్ని పుస్తకాలున్నాయి, అవి ఏఏ కేటగిరిల్లో ఉన్నాయో ఆమె అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు గ్రంథాలయాన్ని ప్రజలకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు, అన్నదాతలకు, మహిళలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం నాగయ్య, గ్రామస్తులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో అఖండ హరేరామనామ సంకీర్తన


హరేరామనామ సంకీర్తన చేస్తున్న భజన బృందం

యద్దనపూడి: మండలంలోని వింజనంపాడు గ్రామంలో వేంచేసి ఉన్న సీతారామస్వామి దేవాలయంలో అఖండ హరేరామనామ సంకీర్తన సప్తాహ పారాయణం ఘనంగా నిర్వహించారు. నిరంతరాయంగా ఏడు రోజుల పాటు నిర్వహించే ఈ సప్తాహ కార్యక్రమాన్ని అవధూతేంద్ర భక్త మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు భక్తమండలి కార్యదర్శి పి. శ్రీరామ్, గంటా కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు.

### వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరం నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ సెంటినియల్ గుంటూరు ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు మండలంలోని పూసపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కొమ్మలపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులు డాక్టర్ కోట ప్రగతి, డాక్టర్ అనూష, బేగం, డాక్టర్ కరణం హేమంత్, డాక్టర్ శివాజీ పాటి బండ్లలు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స అందజేశారు. శిబిరంలో 400 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో రోటరీ ట్రెజరర్ స్రవంత్ కుమార్, సర్వీస్ ప్రాజెక్ట్ అభయ్, గొప్పలపూడి అశోక్, ఎం వీరయ్య పాల్గొన్నారు.


శృంగారపేట వద్ద అందంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్


జాన్‌పేట, జయంతిపేటలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్టార్లు


చీరాలలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్

# మొదలైన క్రిస్మస్ సందడి

- ముఖ్య కూడళ్లలో రంగురంగుల విద్యుత్ స్టార్లు
- సిద్ధమవుతున్న చర్చిలు

చీరాల రూరల్: క్రిస్మస్ పండుగకు చీరాల పట్టణం ముస్తాబవుతోంది. ఏడాదికి ఒక్కసారి వచ్చే పండుగను దళితులు, దళిత క్రైస్తవులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. చీరాల పట్టణంలో అధిక సంఖ్యలో దళితులు, దళిత క్రైస్తవులు అధిక సంఖ్యలో ఉంటారు. ఇప్పటికే పట్టణంలోని అన్ని చర్చిలకు రంగురంగులు పెయింటింగులు వేసి పండుగకు పండుగకు చర్చిలను సిద్ధం చేస్తున్నారు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే ఐక్య క్రిస్మస్‌లు, మినీ క్రిస్మస్‌లు నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ కాంపిటీషన్స్ నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేస్తున్నారు. యువతీ, యువకులు పండుగ పనులలో బిజీగా ఉంటున్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలలోని యువకులు వీధుల్లోని ముఖ్య కూడళ్లలో రంగు రంగుల విద్యుత్ స్టార్లు ఏర్పాటుచేసి మిరుమిట్లు గొలిపిస్తున్నారు. ఇంకొన్నిరోజులు ఉండడంతో గృహిణిలు కూడా ఇంటి పనులు చేసుకుంటూ బిజీగా గడుపుతున్నారు. బూజుపట్టిన ఇళ్లను శుభ్రపరచి పెయింటింగులు వేయిస్తున్నారు. ఇళ్లకు విద్యుత్ దీపాలు వెలిగించి ధగధగమంటూ కాంతులీనేలా చేస్తున్నారు. వస్త్ర దుకాణాలు కూడా కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. మొత్తం మీద క్రిస్మస్ శోభ పట్టణంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉత్సాహంగా కనబడుతోంది.


బల్లికురవలో ఏర్పాటు చేసిన భారీ స్టార్


కొత్తమల్లాయపాలెంలో గ్రామం వద్ద స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన స్టార్

**వాడవాడలా క్రిస్మస్ స్టార్ల ఏర్పాటు..**

బల్లికురవ: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మండలంలో వాడవాడలా భారీ స్టార్‌ల ఏర్పాటుతో పాటు సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి మండలంలోని ప్రధాన గ్రామాల్లోని చర్చిల్లో ఏసు నామంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొణిదెన, కొప్పరపాలెం, ఉప్పుమాగులూరు, మల్లాయపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, చవిటి మాదిగ పల్లె, కొప్పరపాడు, వెలమవారిపాలెం, కూకట్లపల్లి, సుజాత నగర్ కాలనీల వద్ద స్వాగతం పలికేందుకు భారీ స్టార్‌తోపాటు గృహాల వద్ద చిన్న చిన్న స్టార్‌లను ఏర్పాటు చేశారు. ఈనెల 25వ తేదీ వరకు ప్రతి రోజు రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ వేడుకలకు సుదూర ప్రాంతాల నుంచి బంధువుల రాకతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది.



చీరాల పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్టార్లు

## మధురస్మృతుల సమాహారం మంజూష

అద్దంకి రూరల్: మధురస్మృతుల సమాహారం మంజూషా కావ్యం అని గంధ్ర ఆవిష్కరణ కర్త నాగభైరవ ఆదినారాయణ అన్నారు. ఆదివారం సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక రామసుశీల నిలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ మానవ సంబంధాలు, అనుభూతుల సమ్మేళనమే మంజూష కావ్యమన్నారు. పుస్తకం చదివితే ఓ 50 ఏళ్ల కిత్రం బాల్యంలోకి వెళతామన్నారు. కావ్యాన్ని సరళ సుందరంగా పుట్టంరాజు రచించారన్నారు. డీపీఎం సత్యనారాయణ, దేవపాలన పుస్తకంపై సమీక్షించారు. కార్యక్రమంలో వారణాశి రఘురామశర్మ, లక్కరాజు శ్రీనివాసరావు, వీరవల్లి రుద్రయ్య, కె. బాలకృష్ణారెడ్డి, మురళీ సుధాకరరావు, కెవీ పాలిరెడ్డి, అద్దంకి లెవీ ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మంజూషా కావ్యాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ మిత్ర మండలి సభ్యులు

## నేటితో ముగియనున్న పంటనష్ట నమోదు

మార్టూరు: మిచాంగ్ తుఫాన్ తీవ్రత వలన నష్టపోయిన రైతుల పంటల నమోదుకు నేటితో గడువు పూర్తి కానున్నట్లు మండల వ్యవసాయాధికారి వీ కిరణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం మార్టూరులో ఆదివారం సాయంత్రం పొగాకు, శనగ పంటలను పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు. పంటల నష్టం జరిగిన రైతులు సోమవారం సాయంత్రం లోపు తమ పంటల వివరాలను స్థానిక రైతుభరోసా కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. నమోదు చేసుకున్న రైతుల వివరాలను 19వతేదీ నుంచి ఆయా రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శిస్తామని రైతులు పరిశీలించుకోవాలని తెలిపారు. తుఫాన్ వలన శనగ పంట నష్టం సంభవించి మరళా శనగ పంట సాగు చేసే రైతులకు 80 శాతం రాయితీపై శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.


మార్టూరులో పొగాకు పంటను పరిశీలిస్తున్న ఏవో కిరణ్‌కుమార్

### 80 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ


పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఏవో కాశీవిశ్వనాథ్

వేటపాలెం: రైతులకు 80 శాతం రాయితీపై మినుము విత్తనాలు అందజేస్తున్నామని ఏవో ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. మండలంలోని పుల్లరిపాలెం పంచాయతీ పరిధిలో తుఫాన్ కారణంగా నష్టపోయిన పంట పొలాలను అధికారులు ఆదివారం పరిశీలించారు. సోమవారం అన్ని రైతుభరోసా కేంద్రాల వద్ద గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంట నష్టం పోయిన రైతుల జాబితా ఉంచుతారని తెలిపారు. ఈజాబితాలపై రైతులకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తెలియజేయాలని చెప్పారు. రైతుల అభ్యంతరాలపై జాబితాల్లో మార్పులు, చేర్పులు చేపట్టి తుది జాబితా సిద్ధం చేస్తామని పేర్కొన్నారు.

### ఘనంగా జీవధ్వజస్తంభ ప్రతిష్ట


ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చీరాల అర్బన్: కొత్తపేటలోని ఐఎల్‌టీడీ కాలనీలో గల ఓంకార క్షేత్రంలో ఆదివారం నూతన జీవధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత రెండు రోజులుగా ప్రతిష్ఠంచనున్న ధ్వజస్తంభానికి క్షీరాభిషేకం, ధాన్యధివాస కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 9.24 నిమిషాలకు ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం శాంతి కళ్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను ఓంకార క్షేత్ర ఆలయ కమిటీ అధ్యక్షుడు తొగురు సత్యనారాయణ, ధ్వజస్తంభ దాతలు ఎన్నారై ప్రతాప్, ఎం.నాగేశ్వరరావు దంపతులు, శివారెడ్డి, కమిటి కార్యదర్శి రామకృష్ణ శర్మ, కోశాధికారి జీపీఎల్ రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### కరాటేలో యువకుల ప్రతిభ


పతకాలు సాధించిన యువకులతో కోచ్ బ్రహ్మనాయుడు

వేటపాలెం: జాతీయస్థాయి కరాటే పోటీల్లో వేటపాలెం యువకులు ప్రతిభ కనపబరిచి పతకాలు సాధించారు. విజయవాడలోని చిన్నపాటి రామయ్య ఇండోర్ స్టేడియంలో షిటోరియో కరాటే ఎకోమి ఆధ్వర్యంలో 14వ జాతీయ స్థాయి కరాటే పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో వేటపాలేనికి చెందిన అజయ్ శ్రీరామ్ వెండి పతకం, వెంకటసాయి చరణ్ బంగారు పతకం, జాన్ రోనాల్డ్ కాంస్య పతకం, గంటా సాద్విక్ కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ కనబరిచిన యువకులను కోచ్ బ్రహ్మనాయుడు, పలువురు అభినందించారు.

### గ్రామదేవతలకు పూజలు


అలంకరణలో ఈర్ల గంగమ్మ

బల్లికురవ: మార్గశిర మాసం ఆదివారం సందర్భంగా మండలంలోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలతో పాటు తమతమ మొక్కులు తీర్చుకున్నారు. కొణిదెన రెవెన్యూలోని ఈర్ల కొండకు దిగువ భాగంలో ఉన్న ఈర్లగంగమ్మ వద్దకు మల్లాయపాలెం, సోమవరప్పాడు కొప్పరపాలెం, కొండాయపాలెం, చెన్నుపల్లి, నక్కబొక్కలపాడు బల్లికురవ గ్రామాల్లోని భక్తులు అమ్మవారి సన్నిధికి చేరి పొంగళ్లు పెట్టి నివేదించారు. బల్లికురవ, కొత్తపాలెం, గుంటుపల్లి, అంబడిపూడి వల్లాపల్లి గ్రామాల్లోని గ్రామ దేవతలైన పోలేరమ్మ మహాలక్ష్మమ్మ నాభిశిలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయా ఆలయాల్లోని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

### ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్

చీరాల టౌన్: ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలతో పాటుగా ప్రజలకు క్లోరినేషన్ చేసిన మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని దేవాంగపురి పంచాయితీ కార్యదర్శి మురళీ బాపూజీ అన్నారు. ఆదివారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకును క్లోరినేషన్ చేయించడంతో పాటుగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను వలంటీర్లతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి ఘన నివాళులు


సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మార్టూరు: ఇటీవల అకాల మరణానికి గురైన శాసన మండలి సభ్యుడు సాబ్జీకి ఆదివారం సాయంత్రం యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సాబ్జీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బండారు ఆదినారాయణ, పోపూరి సునీల్, బొప్పూడి ప్రతాప్, సీఐటీయూ నాయకులు బత్తుల హనుమంతరావు, కందిమళ్ల రవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

చీరాల టౌన్: మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ ఆదివారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు. అలానే మండల తహశీల్దార్ కార్యాలయంలో అన్నీ గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల పరిధిలోని సచివాలయాల వీఆర్వోలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. సమావేశానికి హాజరయ్యే రెవెన్యూ సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరుకావాలని తహశీల్దార్ సూచించారు.

### అంబేడ్కర్ నగర్‌లో క్రిస్మస్ క్యారల్స్

చినగంజాం: క్రిస్మస్‌ను పురస్కరించుకొని మండల కేంద్రం చినగంజాంలో నిర్వహిస్తున్న క్రిస్మస్ క్యారల్స్ బాల, బాలికలకు చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు ఆదివారం ఆతిథ్యం అందజేశారు. క్రిస్మస్ పురస్కరించుకొని డిసెంబర్ 1 నుంచి చినగంజాం అంబేడ్కర్ నగర్‌లో క్రిస్మస్ క్యారల్స్ సండే స్కూల్ బాల, బాలకలచే మేకల మేషక్‌బాబు నిర్వహిస్తున్నారు. బాల బాలికలు ప్రతి నిత్యం వేకువ జామున కొవ్వొత్తులతో క్రీస్తు నామ జపంతో గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆత్మారావు దంపతులు అల్పాహారం అందజేసి ఆతిథ్యం ఇచ్చారు. దాంతో క్యారల్స్ నిర్వాహకులు సర్పంచ్ దంపతులను శాలువా కప్పి, మథర్ థెరిసా చిత్రపటాన్ని జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కందుల పృథ్వీ, మార్పు సన్నీ, మేడికొండ సునీల్ మహిళలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి హనిమిరెడ్డి

- అద్దంకి బిడ్డగా ఇక్కడే ఇల్లు కట్టుకుంటా
- సీఎం జగన్, వైవీ నమ్మకాన్ని వమ్ము చేయం
- నియోజకవర్గ ఇన్‌చార్జి హనిమిరెడ్డి


శింగరకొండలో పూజలు నిర్వహిస్తున్న హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని శింగరకొండ దేవస్థానంలో ప్రసన్నాంజనేయస్వామి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటిసారిగా శింగరకొండ వచ్చిన ఇన్‌చార్జికు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం శింగరకొండలోని టీటీడీ కల్యాణ కల్యాణ మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. పూజల అనంతరం దేవస్థాన కార్యనిర్వాహణాధికారి టి. సుభద్ర దుశ్శాలువాతో సత్కరించారు. అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. తన అద్దంకి తనకు కొత్త అయినా ప్రతి గ్రామానికి వెళ్లి ప్రతి ఒక్కరిని కలిసి సమస్యలు తెలుసుకుంటానన్నారు. కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలకటం ఆనందంగా ఉందన్నారు. తాను ఎకరం రైతు బిడ్డగా జీవితం ప్రారంభించానని తనకు రైతుల కష్ట, నష్టాలు అన్ని తెలుసన్నారు. అందరికి అండగా ఉంటానన్నారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు. అందరి అండదండలతో భారీ మెజార్టీతో గెలుపొందటానికి శాయశక్తుల కృషిచేస్తానన్నారు. నెల రోజుల్లో సీఎం జగన్‌ను అద్దంకికి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. తకు మద్దతు ఇచ్చిన జిల్లా, నియోజకవర్గంలోని నాయకులందరూ అద్దంకి వస్తారన్నారు. తనకున్న కంపెనీల్లో అద్దంకి వాసులకు ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఒక స్టాండ్ లేని వ్యక్తి అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ ప్రాంతంలో జై తెలంగాణ అని ఆంధ్ర ప్రాంతంలో సమైక్యాంధ్ర అని ప్రజలను వంచించాడన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీ మోసాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను జగనన్న పుట్టినరోజు డిసెంబర్ 21 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్సార్ సీపీ నాయకులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


హనిమిరెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

## వైభవంగా ధనుర్మాసం పూజలు

యద్దనపూడి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని వైష్ణవ ఆలయాలన్ని ఆధ్యాత్మికశోభను సంతరించుకున్నాయి. యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడులోని చెన్నకేశవస్వామి, యద్దనపూడి వేణుగోపాలస్వామి, కల్యాణ వెంకటేశ్వరస్వామి, పూనూరు వేణుగోపాలస్వామి ఆలయాల్లో వేకువజాము నుంచే స్వామివార్లకు మేలుకొలుపు, పంచామృతాలతో అభిషేకాలు, తులసిమాలలతో అర్చనలు నిర్వహించారు. గోదా ఆండాల్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. నెలరోజుల పాటు గోదాదేవి పాడిన 30 పాశురాలను నెలరోజుల పాటు రోజుకొక్క పాశురం చొప్పున తిరుప్పావై పఠనం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. పూజా అనంతరం స్వామివారికి తోమాలను సమర్పించి సహస్ర నామార్చనలు నిర్వహించారు.

వేటపాలెం: మండలం పరిదిలోని చెన్నకేశవ స్వామి దేవస్థానం, రావూరిపేట చెన్నకేశవస్వామి దేవస్థానం, అనుమల్లిపేటలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి దేవస్థానాల్లో స్వామి వారికి ధనుర్మాస పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారి అలహరి నరసింహమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పథకాల అవగాహనకే వికసిత్ భారత్


నాయుడువారిపాలెంలో మాట్లాడుతున్న ఎంఈవో వెంకటేశ్వర్లు


కొప్పరపాడులో గ్యాస్ కనెక్షన్ పంపిణీ చేస్తున్న అనుప్రసాద్

కారంచేడు: పథకాల అవగాహనకే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమ ముఖ్య లక్ష్యమని ఎంపీడీవో ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని జరుబులవారిపాలెం, నాయుడువారిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ మొలబంటి వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, డాక్టర్ యాకూబ్, మాధురీ సిఫోరా, సర్పంచ్ గుమ్మడి సీతామహాలక్ష్మీ, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బల్లికురవ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై డిజిటల్ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించేందుకే గ్రామాల వారీగా వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు చేపట్టినట్లు కోర్డినేటర్ పోలవరపు అనుప్రసాద్ తెలిపారు. ఈనెల 7న మండలంలో ప్రారంభమైన సంకల్పయాత్రలు ఆదివారం కొప్పరపాడు గ్రామ పంచాయతీల్లో ముగిశాయి. యాత్రల్లో భాగంగా 14 మందికి ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లు, 60 మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి జీ. హనుమంతరావు వీఆర్‌వో వై శ్రీనివాసరావు, సెక్రటరీ కెవీ అనిల్ కుమార్, గ్రామ సర్పంచ్ బండారు వెంకాయమ్మ, గురవయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.